విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 23, మే 2025

జిల్లా సమస్యలపై మహానాడులో చర్చించి పరిష్కరించాలి : సీపీఐ

- ప్రభుత్వాసుపత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలి
- సిద్దేశ్వర అలుగు నిర్మాణము త్వరగా పూర్తి చేయాలి
- సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: నంద్యాల జిల్లాలో అట్టహాసంగా జరుగుతున్న మహానాడులో ప్రజా సమస్యలు ఎక్కడేసిన గొంగళి మాదిరిగా అక్కడే ఉన్నాయని, సిద్దేశ్వర అలుగు నిర్మాణము, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలు, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, ఇంకా జిల్లాలో నెలకొన్న ప్రజా సమస్యలపై మహానాడులో చర్చించి అమలు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు డిమాండ్ చేశారు. నంద్యాల సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన పత్రికా విలేకరుల సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడుతో పాటు జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.బాబా ఫక్రుద్దీన్, జిల్లా కార్యవర్గ సభ్యులు కె.భాస్కర్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి జి.నాగరాముడు, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి. సోమన్న, ఏఐటియుసి పట్టణ కార్యదర్శి డి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

సందర్భంగా జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కావస్తున్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నేటి వరకు అమలు పర్చకపోవడం, ప్రజా పాలన అమలుపరుస్తామన్న కూటమి ప్రభుత్వ హామీలను అమలుపర్చడంలో పూర్తిగా వైఫల్యం చెందారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పోలవరం టు బనకచెర్లకు నీటిని తరలిస్తానంటూ సాధ్యం కానీ హామీలు ఇచ్చి రాయలసీమ ప్రజలు మభ్యపెడుతున్నారని ఆరోపించారు. రాయలసీమకు తలమానికమైన సిద్దేశ్వరం అలుగు నిర్మాణం చేపడితే రాయలసీమ అంతటా సస్యశ్యామలవుతుందని, దీనిపై ప్రస్తుత ఎంపీ బైరెడ్డి శబరి తండ్రి బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి సిద్దేశ్వరం అలుగు నిర్మాణం పూర్తి చేయాలని రాయలసీమ అంతటా విస్తృతంగా పర్యటించి, ప్రభుత్వానికి తగిన నివేదిక ఇచ్చినా నాటి ప్రభుత్వాలు ఏ మాత్రం పట్టించుకోకపోవడం జరిగిందని, కూటమి ప్రభుత్వ ఎంపీగా ఉన్న బైరెడ్డి శబరి తన నియోజకవర్గ పరిధిలో ఉన్న సిద్దేశ్వరం అలుగు నిర్మాణంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించి పూర్తి చేయాలని కోరారు. జిల్లా ప్రభుత్వాసుపత్రిలో నెలకొన్న సమస్యలు, ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేసి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 31వ తేదీ నిర్వహించనున్న సిద్దేశ్వరం అలుగు నిర్మాణం వద్ద జరుగు ఆందోళన కార్యక్రమానికి సిపిఐ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తమ పూర్తి సంఘీభావాన్ని ప్రకటిస్తున్నామని, అదేవిధంగా జిల్లాలో జరుగుతున్న మహానాడులో టీడీపీ ఎమ్మెల్యేలందరూ సిద్దేశ్వరం అలుగు నిర్మాణంపై ఓ తీర్మానం చేసి అమలు చేసే విధంగా చేయాలని డిమాండ్ చేశారు.

వాట్సాప్ వీడియోకు స్పందించిన మంత్రి

విశాలాంధ్ర - బనగానపల్లె: పట్టణంలో 16 వార్డ్ పరిధిలోని కొండపేట వీధికి చెందిన దివ్యాంగుడు బోయ నవీన్ వీధిలో మురుకి నీరు నిలువ ఉండి దుర్వాసన వస్తుండడంతో సెల్ ఫోన్‌తో వీడియో తీసి రోడ్లు భవనాల పెట్టుబడులు మౌలిక సదుపాయాలు శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డికి వాట్సప్ చేయడం జరిగింది. మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి వెంటనే స్పందించి గురువారం నాడు స్వయంగా క్షేత్రస్థాయిలో కొండపేట వీధిని ఆకస్మిక తనిఖీ చేయడం జరిగింది. ఈ మేరకు స్థానిక ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మహిళలు పందులు వీధిలో ఎక్కువగా సంచరిస్తున్నాయని మంత్రి దృష్టికి తీసుకురాగా వారంలోగా పందులను తొలగించాలని అధికారులను ఆదేశించారు. మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి స్థానికంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఉండేందుకు అతి త్వరలో కాలువల నిర్మాణం చేపడతామన్నరు. తాత్కాలికంగా మురికి నీరు నిల్వ ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఉప సర్పంచ్ బురానుద్దీన్, పంచాయతీరాజ్ డిఇ నాగ శ్రీనివాసులు, డిప్యూటీ ఎంపీడీవో సతీష్ కుమార్ రెడ్డి, అర్బన్ సీఐ ప్రవీణ్ కుమార్, మంత్రి పిఏలు మురళీమోహన్ రెడ్డి, రామలింగారెడ్డి గ్రామ సచివాలయం సిబ్బంది స్థానిక టిడిపి నాయకులు పాల్గొన్నారు.

అర్హులైన కౌలు రైతులకు హక్కు పత్రాలు

విశాలాంధ్ర - చాగలమర్రి: మండలంలో అర్హులైన కౌలు రైతులకు పంట సాగుదారుల హక్కు పత్రాలను అందజేస్తామని వ్యవసాయాధికారి రంగనేతాజీ తెలిపారు. గురువారం మండలంలోని నేలంపాడు, పెద్దబోధనం గ్రామాలలో వ్యవసాయాధికారి అధ్యక్షతన పంట సాగుదారుల హక్కు పత్రాలపై భూ యజమానులు, కౌలు రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హక్కు పత్రాల ద్వారా కౌలు రైతులందరికి ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పంటల బీమా, ఇన్‌పుట్‌సబ్సిడీ, కనీస మద్దతుధర, వ్యవసాయ శాఖ ద్వారా అందించి రాయితీలు వర్తిస్తాయన్నారు. అర్హులైన కౌలు రైతులందరూ వీఆర్వో, వీఏఏలను సంప్రదించి పంట సాగు పత్రాలను పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని వీఏఏలు, కౌలు రైతులు, భూ యజమానులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి రేషన్ డీలర్ల పాలాభిషేకం

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : రాష్ట్ర వ్యాప్తంగా ఎండియు వాహనాలను తొలగించి, రేషన్ డీలర్ వ్యవస్థను పునరుద్ధరిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకోవడం పట్ల ఆళ్లగడ్డ రేషన్ డీలర్లు హర్షం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక తాహసిల్దార్ కార్యాలయానికి చేరుకొని తాహసిల్దార్ జ్యోత్స్న రత్న కుమారికి స్వీట్ ఇచ్చారు. ఈ సందర్భంగా తాహసిల్దార్ మాట్లాడుతూ ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొని రావాలన్నారు. అనంతరం రేషన్ డీలర్లు ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మాజీ కౌన్సిలర్ సలాం, బైసాని ప్రసాద్, మజీద్, శ్రీనాథ్, బాలయ్య, పాములేటి, అబ్దుల్లా, మద్దిలేటి, దస్తగిరి రెడ్డి, బాలిరెడ్డి, వెంకటేశ్వర్లు, లక్ష్మీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్రివిధ దళాలను అభినందించిన బ్రహ్మానంద చారి

విశాలాంధ్ర - బనగానపల్లె: త్రివిధ దళాలను, కేంద్ర ప్రభుత్వాన్ని జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జెఎస్ఎస్ బ్రహ్మానంద చారి అభినందించారు. మండలం పరిధిలోని పలుకూరు గ్రామంలో జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జెఎస్ఎస్ బ్రహ్మానంద చారి మాట్లాడుతూ ఆపరేషన్ సిందూరితో పాకిస్తాన్‌లో ఉగ్రవాదులు తుద ముట్టించడం మనవాళ్లు కనపరిచిన ప్రతిభతో ప్రపంచ దేశాల ఆశ్చర్యపోయాయని, మన సైన్యం శక్తి పాటవాలు ప్రపంచ దేశాలకు ఎరుకైందని తెలిపారు. నందివర్గం ఏఎస్ఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు దేశభక్తి కలిగి ఉండాలని దేశం కోసం ఎలాంటి త్యాగానికైనా సిద్ధం కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ్ నాయక్, కానిస్టేబుల్ పుల్లయ్య, వీర ప్రకాష్, మలి, నందివర్గం పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సమ్మర్ క్రికెట్ టోర్నీ ప్రారంభం

విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్ : పట్టణం లోని స్థానిక క్రీడా మేధానం నందు సద్దాం అండ్ ఫ్రెండ్స్ ప్రారంభించిన క్రికెట్ టోర్నిని మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు, టీడీపీ నాయకులు మోటార్ షఫీల్లా, అమ్మల్లా, షాషా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రమేష్ బాబు మాట్లాడుతూ క్రీడలు మనిషికి మానసిక ఉల్లాసన్ని, వారి ప్రతిభనూ వెలికి తీస్తాయి. క్రీడలను క్రీడా స్పూర్తితో ఎలాంటి అంతరాయాలు కలుగకుండా క్రీడాకారు లందరూ సమన్వయంతో ఈ టోర్నీని ముందుకు తీసుకుపోవాలి ఆయన అన్నారు.

CHANGE OF NAME

I, MAHAMAD YUNUS S/O JAMAL SAHEB NADIGADDA KATTAMEEDI, H. No 7/85. Nadigadda Street, Nandyal 518501, Nandyal District, A.P. hereby state that I, have changed my name MAHAMAD YUNUS (OLD NAME) TO MAHAMMAD YUNUS NADIGADDA KATTAMEDI (NEW NAME) and known as MOHAMMAD YUNUS NADIGADDA KATTAMEEDI

మద్యాన్ని తాకట్టు పెట్టి కోట్ల రూపాయల అప్పు తెచ్చిన ఘనుడు జగన్

- సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తాం
- నాయకులకు, కార్యకర్తలకు న్యాయం చేస్తాం
- కార్యకర్తల త్యాగాల ఫలితమే టిడిపి ఘన విజయం
- కడప మహానాడును విజయవంతం చేయాలని పిలుపు
- చంద్రబాబును విమర్శించే అర్హత జగన్‌కు లేదు
- మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, ఫరూక్

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : మద్యాన్ని తాకట్టు పెట్టి రూ. 26 వేల కోట్ల అప్పు తెచ్చిన ఘనుడు జగన్ మోహన్ రెడ్డి అని మంత్రులు బీసీ, ఫరూక్ ఆరోపించారు. నంద్యాల టెక్కె మార్కెట్ యార్డులో గురువారం టిడిపి జిల్లా మహానాడు అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా మంత్రులు ఫరూక్, బీసీలు మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలను తప్పక అమలు చేస్తా మని, టిడిపి నాయకులకు, కార్యకర్తలకు న్యాయం చేస్తామని, కార్యకర్తల త్యాగాల ఫలి తమే టిడిపి ఘన విజయమన్నారు. కడప మహా నాడును విజయవంతం చేయాలని టీడీపీ నాయకులు, కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, ఫరూక్ తో పాటు ఎంపి బైరెడ్డి శబరి, ఎమ్మెల్యేలు భూమా అఖిలప్రియ, గౌరు చరిత, బుడ్డా రాజశేఖరరెడ్డి, జయసూర్య తదితరులు పాల్గొని ప్రసంగించారు. మంత్రి ఫరూక్ మాట్లాడుతూ టిడిపి ఆవిర్భావం నుండి తాను తెలుగుదేశం పార్టీలో ఉన్నానని తనకు ఇన్ని పదవులు రావడానికి కారణం నంద్యాల ప్రజలు పెట్టిన బిక్ష అన్నారు. తెలుగుగంగ ప్రాజెక్టును తెచ్చిన ఘనత స్వర్గీయ ఎన్టీఆర్ దేనన్ని రైతులకు శాశ్వతమైన పనులు చేసిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడని, ఆనాడు హైదరాబాద్, సైబరాబాద్, హైటెక్ సిటీని అభివృద్ధి చేసి చూపించాలని, నేడు అమరావతిని కూడా అభివృద్ధి చేస్తాడని, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను చంద్రబాబు అభివృద్ధి చేస్తాడన్నారు. జగన్ మాట్లాడే బాషను ప్రజలు అసహ్యించు కుంటున్నారని, పోలీ సులను బట్టలూడదీసి కొడతా మనడం ఎంతవరకు సమం జసమని ప్రశ్నించారు. కడపలో హజ్ హౌస్‌ను పూర్తి చేయలేదని, కర్నూలులో ఉర్దూ యూనివర్సిటీ ఉందన్నారు. చంద్రబాబును విమ ర్శించే అర్హత జగన్ లేదన్నారు. మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ వైసీపీది అరాచక పాలన అని, నేడు టిడిపి అభివృద్ధి, సంక్షేమ పాలన అందిస్తుందని వివరించారు. సీఎం చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధికి రాత్రి పగలు కష్టపడుతున్నారని నంద్యాలలో చంద్రబాబును అరెస్ట్ చేయడం ఇంకా మరువలేదన్నారు. వైసీపీ పతనం చంద్రబాబు అరెస్ట్ తోనే ప్రారంభమైందన్నారు. సీడ్స్ రాష్ట్ర చైర్మన్ ధర్మారం సుబ్బారెడ్డి, మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి, మార్క్ ఫెడ్ డైరెక్టర్ తులసి రెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శులు వి. రామచంద్రరావు, ఏవిఆర్ ప్రసాద్, జిల్లెళ్ళ శ్రీరాములు, రాష్ట్ర డైరెక్టర్లు, నీటి సంఘం చైర్మన్లు ఇలియాస్, కౌన్సిలర్లు కండే శ్యాంసుందర్ లాల్, నాగార్జున, పట్టణ టిడిపి అధ్యక్షుడు మణియార్ ఖలీల్, టిడిపి నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వేతనాలు విడుదల చేయకపోతే ఛలో విజయవాడ

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : రాష్ట్రవ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించి ముందుకు నడిపిస్తున్న సిబ్బందికి నేటి వరకు 14 నెలలుగా వేతనాలు విడుదల చేయకపోవడం వల్ల వారి కుటుంబాలు పూట గడవక అగమ్య గోచర మయ్యాయని, తక్షణమే పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలతో పాటు ఛలో విజయవాడ చేపడుతామని ఏపీ ప్రకృతి వ్యవసాయ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ బాబు హెచ్చరించారు. నంద్యాల ఆర్‌వైఎస్ఎస్ కార్యాలయంలో ఉద్యోగులతో కలిసి డీపీఎంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 14 వేల మంది ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులకు 12 నెలలుగా వేతనాలు ఇవ్వకుంటే వారి కుటుంబాలు ఎలా గడుస్తాయని నిలదీశారు. ప్రభుత్వ ఉద్యోగులకు రెండు నెలలు వేతనాలు రాకుంటేనే పూట గడవడం ఇబ్బందిగా ఉందని, ఇన్ని నెలలు పెండింగ్ లో ఉంచడం వల్ల మహిళా ఉద్యోగులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పెండింగ్ వేతనాలు విడుదల చేయకపోతే ఆర్‌వైఎస్ఎస్ కార్యాలయం ఎదుట నిరాహారదీక్షకు సిద్ధమన్నారు. వేతనాలు విడుదల చేయకుండా ఇబ్బందులకు గురి చేయడం తగదన్నారు. పింఛన్ సౌకర్యం కల్పించాలన్నారు. పిఎసిఎస్‌ఐ సౌకర్యం కల్పించి ఎస్ఆర్ పాలసీ అమలు చేయాలని కోరారు. వేతనాలు విడుదల కానీ పక్షంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళనకి పిలుపు ఇస్తామని, అవసరమైతే ఛలో విజయవాడకు సిద్ధమవుతామన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

యోగ ఆంధ్రా యాప్‌లో ఏడు లక్షల మందిని రిజిస్టర్ చేయించండి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: మానవ దైనందిన జీవితంలో యోగాకు అత్యధిక ప్రాముఖ్యత ఉన్నట్లు ఐక్యరాజ్యసమితి ధ్రువీకరించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం యోగా కార్యక్రమానికి అత్యధిక ప్రాధాన్యత నిచ్చిందని, ఈ మేరకు ప్రభుత్వం నిర్దేశించిన కార్యక్రమాలను ముమ్మరంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి జిల్లా, మండల స్థాయి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో యోగ ఆంధ్రా - 2025 కార్యక్రమాల అమలుపై ఎంపిడిఓలు, తహశీల్దార్లు, మున్సిపల్ కమీషనర్లు, స్పెషల్ ఆఫీసర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్, డిఆర్ఓ రాము నాయక్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దైనందిన జీవితంలో ఆరోగ్య పరిరక్షణకు యోగ ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన తీసుకొస్తూ కార్యక్రమాలు చేపట్టాలని ప్రభుత్వం సూచించింద న్నారు. ఈ మేరకు జిల్లాలో 7 లక్షల మందిని యోగ ఆంధ్రా యాప్ ఈ నెల 27వ తేదిలోగా నమోదు చేయించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశిం చారు. 2014లో ఐకారాజ్య సమితి జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించేలా తీర్మానం చేయడం జరిగిందన్నారు. అప్పటినుంచి ప్రతి సంవత్సరం జూన్ 21వ తేది నుండి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. ఈ సంవత్సరం జూన్ 21వ తేదీన వైజాగ్ లో జరిగే అంతర్జాతీయ యోగా కార్యక్రమంలో ప్రధానీ, రాష్ట్ర ముఖ్యమంత్రి పాల్గొం టారన్నారు. జిల్లా నుండి గుర్తించిన యోగ గురువులు, శిక్షకులకు ఢిల్లీలోని మొరార్జీ దేశాయ్ యోగ ఇన్స్టిట్యూట్ నుండి శిక్షణ ఇవ్వడం జరుగుతుం దన్నారు. శిక్షణ పొందిన శిక్షకులు మండల స్థాయిలో 200 మందికి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, ఈ అంశంలో మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఓలు, తహ శీల్దార్లు, స్పెషల్ ఆఫీసర్లు, ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. మున్సిపల్ పట్టణాల్లో జన సంచారం అధికంగా ఉన్న ప్రాంతాల్లో యోగా నేపథ్యానికి సంబంధించి ఆకర్షణీయమైన పెయింటింగ్స్ వేయించాలని మున్సిపల్ కమీషనర్లను కలెక్టర్ ఆదేశించారు.

క్రీడాకారునికి చేయూత..

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : జాతీయస్థాయి కుస్తీ పోటీలలో పాల్గొనే వివేకానంద అనే విద్యార్థికి ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన భాను ఎక్సైడ్ బ్యాటరీ అధికృత డీలర్, న్యాయవాది షాకీర్ హుస్సేన్ చేయూత అందించారు. ఈనెల 16,17వ తేదీలలో చిత్తూరులో జరిగినటువంటి రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలలో వివేకానంద బంగారు పతకం సాధించాడు. ఆర్ఆర్ అకాడమి క్రీడాకారుడు వివేకానంద ఈనెల 24 నుండి 26 తేదీ వరకు హర్యానా రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి కుస్తీ పోటీలలో పాల్గొంటున్నాడు. గురువారం వివేకానందకు షాకీర్ హుస్సేన్ కుస్తీ పోటీలకు అవసరమైన డ్రెస్సు, షూ కు రూ.3 వేలను అందించారు. ఆళ్లగడ్డ ఆర్ఆర్ అకాడమీ నుండి ఎంతో మంది క్రీడాకారులు క్రికెట్, ఫుట్బాల్, హ్యాండ్ బాల్, అథ్లెటిక్స్, రెజ్లింగ్ గత మూడేళ్ల నుండి జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి క్రీడాకారులను శిక్షణ ఇచ్చి పోటీలలో పాల్గొనే విధంగా అంచెలంచలుగా అభివృద్ధి పదంపై నడిపిస్తున్న ఆర్ఆర్ అకాడమీ నిర్వాహకులకు ధన్యవాదములు తెలిపారు. అంతర్జాతీయ స్థాయి పోటీలలో పాల్గొని మన ఆళ్లగడ్డకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని షాకీర్ హుస్సేన్ తెలిపారు. కోచ్ సుబ్బారాయుడు మాట్లాడుతూ 6 నుండి 14 ఏళ్ల పిల్లలకు ప్రతిరోజు ఉదయం 6 గంటలకు, సాయంత్రం 4:30 శిక్షణా తరగతులు ప్రారంభమవుతాయని ఆళ్లగడ్డ పట్టణ పిల్లల తల్లిదండ్రులు దీనిని ఉపయోగించుకోగలరని వారు తెలిపారు.

రాంకోలో అగ్ని ప్రమాదం

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల: మండలంలోని కలవటాల గ్రామ పరిదిలో నిన్న రాంకో సిమెంట్ పరిశ్రమలో బుధవారం సాయంత్రం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. రాంకో ఫ్యాక్టరీలో పనుల్లో భాగంగా ఓ కార్మికుడు వెల్డింగ్ వేస్తుండగా ఆకస్మికంగా మంటలు చెలరేగాయి. దీంతో సమీపంలోనే సిలిండర్లు ఉండడంతో కార్మికులు భయాందోళన చెందారు. ఆ ప్రాంతంలోఅగ్నికీలకలు పెద్ద ఎత్తున ఎగిసిపడి దట్టమైన పొగలు అలుముకున్నాయి. దీంతో ఆ ప్రాంతంలో ఏం జరుగుతుందో కొద్దిసేపు కార్మికులకు అర్థం కాక తీవ్ర భయాందోళన చెందారు. రాంకో ఫైర్ ఇంజన్‌తో పాటు అల్ట్రాటెక్ ఫైరింజన్లు ప్రమాద ఘటన ప్రాంతానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఇతర ప్రాంతాలకు మంటలు వ్యాపించకపోవడంతో పాటు, కార్మికులు సురక్షితంగా బయటపడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

అనుమానాస్పదగా వ్యక్తి మృతి

విశాలాంధ్ర - పాములపాడు : అనుమానాస్పదంగా వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని జూటూరు గ్రామ సమీపంలోని కేసీ కెనాల్లోపై చోటు చేసుకుంది. స్థానికులు పోలీసుల వివరాల మేరకు జూటూరు గ్రామానికి చెందిన సత్యం (48) 21 తారీకు మధ్యాహ్నం తన భార్య పిల్లలు ఊరు వెళ్లడంతో ఇంట్లో నుంచి బయటికి వెళ్లి రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో ఉదయం తెల్లవారుజామున సత్యం తల్లి లక్ష్మీదేవి వారి బంధువులుగ సత్యం ఫోన్ చేశారు. ఫోన్ తీయకపోవడంతో ఎక్కడికి వెళ్లాడని ఆరా తీశారు గురువారం ఉదయం కేసీ కెనాలు కట్టమీద తూము దగ్గర సత్యం పడి ఉండడం చూసి, ఉపాధి కూలీలు సత్యం తల్లికి సమాచారాన్ని ఇచ్చారు. సత్యం తల్లి బంధువులతో అక్కడికి వెళ్లి చూడగా సత్య మృతి చెందాడని, తమ కొడుకు మృతికి కారణాలను కనుగొని తమకు న్యాయం చేయాలని ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై సురేష్ బాబు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు, మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

విశాలాంధ్ర - శిరివెళ్ల : మండల పరిధిలోని వెంక టాపురం గ్రామంలోని 40వ జాతీయ రహదారి ప్రక్కన వెలసిన శ్రీ నెట్టికంటి అభ యా ఆంజనేయ స్వామి దేవా లయంలో హనుమాన్ జయం తి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గత మూడు రోజులుగా కొనసాగుతున్న విశేష పూజలు అన్నదాన కార్యక్రమాలు కళాకారుల ఆధ్యాత్మిక భజన కార్యక్రమాలు భక్తజన హృదయాలలో ఆధ్యాత్మిక వైభవం నెలకొల్పింది. భక్తుల హనుమాన్ చాలీసా, హనుమాన్ భక్తి గీతాలు ఆరాధనలతో కళాకారుల చెక్కభజన కార్యక్రమాలతో వెంకటాపురం గ్రామంలో వెలసిన శ్రీ నెట్టికంటి అభయాంజనేయ స్వామి వారి గ్రామోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. సీతారామలక్ష్మణ స్వాముల వారికి ఆంజనేయ స్వాముల వారికి భక్తులు కాయ కర్పూరం, ఆకు పూజ, అభిషేకం ఇతర విశేష పూజలు నిర్వహించి తమ మొక్కులను తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అర్చక స్వాములు మాట్లాడుతూ భూతప్రేత పిశాచాలు సైతం హనుమంతుడి పేరు చెబితే భయపడి పారిపోతాయని, మహా రోగాలు మటుమాయం అవుతాయని, శని ప్రభావం వల్ల కలిగే బాధలూ తొలగిపోతాయని తెలిపారు. మంచి బుద్ధి కలుగుతుందని, కీర్తి లభిస్తుందని, ధైర్యం వస్తుందని, హనుమంతునికి 5 సంఖ్య చాలా ఇష్టమని, అందుకే ఐదు ప్రదక్షిణలు చేయాలని భక్తులకు సూచించారు. .

ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : మండలంలోని ఆయా గ్రామాల్లో వెలిసిన ఆంజనేయ స్వామి ఆలయాలలో భక్తులు హనుమాన్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని మీర్జాపురం, ఇటిక్యాల, అంకిరెడ్డిపల్లి, తిమ్మనాయుని పేట, హనుమంతు గుండం, కోరుమానుపల్లి, తుమ్మలపెంట, బెలుం, కల్వటాల, నందిపాడు తదితర గ్రామాలలో హనుమాన్ ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. ఆంజనేయ స్వామి ప్రత్యేక పూజల్లో భక్తులు పాల్గొన్నారు. అయా ఆలయాలలో విచ్చేసిన భక్తులకు అన్నదానం గావించారు. మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి దేవాలయం నుండి మీర్జాపురం గ్రామ సమీపంలోని అభయ ఆంజనేయ స్వామి దేవాలయం వరకు బైకులతో భారీ శోభయాత్ర చేశారు. విశ్వహిందూ పరిషత్ నంద్యాల జిల్లా కార్యదర్శి కిషోర్, ఆర్ఎస్ఎస్ కంద చంద్రశేఖర్ రెడ్డి, రాముదు నాయక్, సమరసత అధ్యక్షులు శ్రీనివాసులు తదితరుల ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి గుడి నుండి జమ్మలమడుగు క్రాసింగ్, ఎమ్మార్వో ఆఫీస్, సాయిబాబా దేవాలయం, టిడిపి ఆఫీస్, తేరు మీద్దే ఎస్బిఐ, మీదుగా ప్రధాన రహదారి నుండి మీర్జాపురం అభయ ఆంజనేయ స్వామి వరకు శోభయాత్ర నిర్వహించారు. జైశ్రీరామ్ నినాదాలతో ర్యాలీ చేపట్టి భక్తులు భక్తిని చాటుకున్నారు.

విశాలాంధ్ర - నందికొట్కూరు : కార్యసాధకుడికి హనుమంతుడే ఆదర్శమని, ప్రత్యేకించి యువత ఆశించిన లక్ష్యాన్ని చేరుకోవాలంటే హనుమంతుని పట్టుదల పరాక్రమం అలవరచుకోవాలని ధార్మిక ప్రవచకులు, అసిస్టెంట్ ప్రొఫెసర్ యం. పార్వతీదేవి అన్నారు. గురువారం హనుమజ్జయంతిని పురస్కరించుకుని నందికొట్కూరు పట్టణంలోని రామాలయం నందు ఏర్పాటుచేసిన వేడుకలో హనుమద్ వైభవం గురించి ప్రవచించారు. ఇందులో భాగంగా ఉదయం ఆంజనేయ స్వామికి అభిషేకం, సింధూరాభిషేకం, ఆకుపూజ, విశేషాలంకరణలు, సామూహిక హనుమాన్ ఛాలీసా పారాయణం, భజనలు, తదనంతరం వక్తలచే హనుమజ్జయంతి విశిష్టతపై ధార్మిక ప్రవచనాలు వినిపించారు. అదేవిధంగా పట్టణంలో భారీ శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామాలయం కోశాధికారి ఎస్.శ్రీనివాసులు, అల్వాల బాలయ్య, బీజేపీ సీనియర్ నాయకులు పారెడ్డి శివారెడ్డి, చిన్న వెంకటేశ్వర్లు, మేదరి వెంకటేశ్వర్లు, ఎస్.వెంకటేష్, ఎం.రాఘవ, ఒ.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

విశాలాంధ్ర-అవుకు: మండలంలోగురువారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల అన్ని గ్రామాలతో పాటు పట్టణంలోని సెంటరు, కోటా వీధి, సంజీవరాయ తోటలో వెలిసిన శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో, నిచ్చెనమెట్ల గ్రామంలో వెలిసిన అతి పురాతనమైన ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పుష్ప అలంకరణ ఆకు పూజ పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం 4 గంటల సమయం నుంచి స్వామివారిని పల్లకిలో కన్నుల పండుగగా గ్రామోత్సవ ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చెన్నప్ప. చెన్నయ్య, వెంకటేశ్వర్లు, వాయి నందన గౌడ్, విక్రమ్ గౌడ్, వినోద్, సుబ్రహ్మణ్యం, అధిక సంఖ్యలో ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 23, మే 2025

90శాతం సబ్సిడీతో రైతులకు వెంటనే విత్తనాలు : ఏపీ రైతు సంఘం

విశాలాంధ్ర - కర్నూలు: 90శాతం సబ్సిడితో రైతులకు విత్తనాలు ఇవ్వాలని ఏపీ రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత వారం రోజులుగా జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి కానీ ఇంతవరకు రైతులకు వేరుశనగ విత్తనాలు ప్రభుత్వం సరఫరా చేయలేదన్నారు. ఖరీఫ్ సీజన్ మొదలైనా ఇంతవరకు వేరుశెనక్కాయలు విత్తనాలు సేకరణ చేయలేదని, గ్రేడింగ్ చేయలేదని, టెండర్లు పిలవలేదని తెలిపారు. గత ఏడాది ఈ నెల 15 నాటికే వేరుశన విత్తనాలు సరఫరా చేశారని, ఇప్పుడు జూన్ 1వ తేదీ రాబోతున్న ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన ఇంతవరకు విత్తనాలు సేకరణ జరగలేదన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు 90 శాతం సబ్సిడీపై విత్తనాలు ఇవ్వాలన్నారు. కౌలు రైతుల గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. అన్నదాత సుఖీభవ పేరుతో రైతులకు రావలసిన రూ.20 వేలు రైతుల అకౌంట్లో తక్షణమే జమ చేయాలన్నారు. పత్తి విత్తనాలు నాణ్యతలేని కాలం చెల్లిన విత్తనాలు నూజివీడు మార్కెట్లోకి విస్తారంగా వస్తున్నవి కమిషన్ ఏజెంట్లు బ్రోకర్లు ఇలాంటి విత్తనాలు నమ్మి డబ్బులు దండుకుంటున్నారని దీనివలన రైతు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. నకిలీ విత్తనాలు రాకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు తక్షణమే విత్తనాలు పంపిణీ చేయాలని కోరారు.

ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయొద్దు

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : ప్రజల నుండి వచ్చే ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయొద్దని నగరపాలక సంస్థ మేనేజర్ ఎన్.చిన్నరాముడు సిబ్బందికి సూచించారు. గురువారం ఆయన నగరపాలక కార్యాలయంలోని ప్రజా ఫిర్యాదుల స్వీకరణ విభాగాన్ని అకస్మిక తనిఖీ చేశారు. సంబంధిత విభాగ అధికారి అందుబాటులో లేకపోవడం, దస్త్రాలు సక్రమంగా లేకపోవడంపై మేనేజర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. మేనేజర్ మాట్లాడుతూ నగరంలో నగరపాలకకు సంబంధించి ఎన్నో సమస్యలు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ విభాగానికి వస్తాయని, కాబట్టి ఇక్కడ పనిచేసే సిబ్బంది ఏమాత్రం అజాగ్రత్తగా ఉండరాదన్నారు. వచ్చిన విన్నపా లను తక్షణమే సంబంధిత అధికారులకు పంపించి, ఎప్పటికప్పుడు సమస్య పరిష్కార స్థితిని కనుగొని ఫిర్యాదుదారుడికి తెలియజేయాలని సూచించారు. పని వేళల్లో తప్పని సరిగా అందుబాటులో ఉండాల్సిందేనని, దస్త్రాలను సక్రమంగా నిర్వహించాలని మేనేజర్ ఆదేశించారు. నగర ప్రజలు తమ కాలనీల్లో చిన్నపాటి సమస్యల పరిష్కారం కోసం హెల్ప్‌లైన్ నెంబర్ 7422992299 కి కాల్ లేదా వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని, పురమిత్ర యాప్‌లో సైతం ప్రజలు తమ సమస్యలను తెలుపవచ్చని మేనేజర్ అన్నారు. కార్యక్రమంలో సరస్వతి, నాగమణి, రాజశేఖర్ పాల్గొన్నారు.

- జిల్లాలో ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తికి ప్రభుత్వంపై వత్తిడి
- బీసీలకు అండగా టీడీపీ
- టీడీపీలో భగ్గుమన్న విభేదాలు

బీసీ రక్షణ చట్టం తేవాలి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: జిల్లా సమగ్రాభివృద్ధికి టీడీపీ కృషి చేయడంతోపాటు బీసీ రక్షణ చట్టం తీసుకు రవాలని, జిల్లాలో ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తికి ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావాల్సి ఉందని టీడీపీ నాయకులు అన్నారు. గురువారం కర్నూలు నగర శివారులోని కమ్మ సంఘం కళ్యాణ మండపంలో టీడీపీ కర్నూలు పార్లమెంట్ అధ్యక్షులు తిక్కారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. మహానాడు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన టీడీపీ పతాకాన్ని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు, టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్‌టీ రామారావుకు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఇటీవల జమ్ము కాశ్మీరులోని మృతులకు, ప్రజలకు వైసీపీ నేతల చేతిలో మృతి చెందిన టీడీపీ కార్యకర్తలకు ఆత్మశాంతించాలని కోరుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి తిక్కారెడ్డి మాట్లాడుతూ వైసీపీ రాక్షణ పాలకు విసుకు చెందిన ప్రజలు రాష్ట్రంలో టీడీపీని బారీ మెజారిటీతో గెలిపించారన్నారు. కర్నూలు జిల్లాలో కూడా టీడీపీ బారీ విజయం నమోదు చేసుకుందన్నారు. ఉమ్మడి కర్నూలు జల్లాలో రెండు పార్లమెంట్ సీట్లు విజయం సాధించగా 14 శాసన సభ స్థానాల్లో 12 విజయం సాధించామన్నారు. జిల్లాలోని 7 అసెంబ్లీ స్థానాల్లో టీడీపీ నాలుగు బీసీ, ఒకటి రెడ్డి, ఒకటి ఎస్సీ రిజర్వుడుకు పోగా ఒక ఆర్యవైశ్యలకు కేటాయించడం జరిగిందన్నారు. మంత్రాలయం, ఆలూరు స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలైనా మిగిలిన 5 అసెంబ్లీ, ఒక పార్లమెంట్ స్థానంలో బారీ విజయం నమోదు చేసుకున్నామన్నారు. పార్టీకోసం కష్టపడ్డ వారిని చాలా మందిని గుర్తించి నామినేటెడ్ పదవులు ఇవ్వడం జరిగిందన్నారు. కడప మహానాడు అయిన తరువాత మరికొందరికి నామినేటెడ్ పోస్టులు ఇచ్చేందుకు జాతీయ అధ్యక్షులు సుముఖంగా ఉన్నారని తెలిపారు. అందరికి పదవులు ఇవ్వడం సాధ్యం కాదని పార్టీకోసం కష్టపడుతుంటే ఏదో ఒకరోజు అధిష్ఠానం కార్యకర్త శ్రమను గుర్తించి అవకాశం ఇస్తుందన్నారు. ఇటీవల నియోజకవర్గాల్లో జరిగిన మహానాడు సందర్భంగా చేసిన తీర్మాణాలను ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి చదివి వినిపించారు. ఈ తీర్మాణాలను మహానాడులో ప్రవేశపెట్టి చర్చించి రాష్ట్రస్థాయిలో తీర్మాణం చేయించి పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రతి ప్రజాప్రతినిధి, నాయకులు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా గుండ్రేవుల, వేదవతి, ఆర్డీఎస్ ప్రాజెక్టులు పూర్తి చేయడం, హంద్రీనివా ప్రాజెక్టు నుండి చెరువులు నింపడంతోపాటు పిల్లకాల్వల ద్వారా సాగుకు నీరు అంది ంచేందుకు కృషి చేయాలని, కోడుమూరుకు తాగునీటి ఇబ్బందుల నుండి గట్టెక్కించేందుకు గాజులదిన్నె ప్రాజెక్టు నుండి నీటిని తీసుకురావడం లాంటి తీర్మాణాలు మహానాడులో ప్రవేశపెట్టడం జరుగుతుందన్నారు. రాబోయే స్థానిక సంస్థలపై ప్రతి ఒక్కరు దృష్టి సారించాలన్నారు. అందరూ ఐక్యంగా కృషిచేసి 2024 ఎన్నికలలో మాదిరిగానే ఘనవిజయం సాధించేందుకు ప్రతి ఒక్కరు కృషిచేయాలన్నారు. కర్నూలు జిల్లా సమగ్రాభివృద్ధికి కృషిచేయాలని,పారిశ్రామ హబ్‌గా మార్చి వలసల నివారణకు కృషిచేయాలన్నారు. యువగళం పాదయాత్ర సందర్భంగా యువనేత నారాలోకేష్ ఇచ్చిన హామీల అమలుకు కృషిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కడపలో ఈనెల 27, 28, 29 తేదీల్లో జరుగు మహానాడుకు కర్నూలు జిల్లా నుండి బారీ ఎత్తున బహిరంగ సభలకు తరలివచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని లక్ష మంది జిల్లా నుండి మహానాడు బహిరంగ సభకు తరలించాలని కోరారు.

మహానాడు వేదికగా భగ్గుమన్న విభేదాలు: మహానాడు వేధిక టీడీపీలో విబేధాలు భగ్గుమన్నాయి. మహానాడు వేధికపై మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ మంత్రి టీజీ భరత్‌ను టార్గెట్ చేస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాలో మేయర్లు, చైర్మెన్‌లపై అవిశ్వాస తీర్మాణం పెట్టి తొలగిస్తుంటే కర్నూలులో మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. పార్టీలో వారిని కాదని వైసీపీ నుండి వచ్చిన వారికి పదవులు ఇస్తున్నారని ఆరోపించారు. మేయర్ విషయంలో నెలరోజులు గడువు ఇస్తున్నామని తరువాత ప్రత్యక్ష కార్యచరణకు దిగుతామన్నారు. పాణ్యం నియోజకవర్గంలో 18 కార్పొరేటర్‌లు ఉన్నారని పాణ్యం ఎమ్మెల్యే చొరవ తీసుకొని కలసి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బస్తిపాడు నాగరాజు, ఎమ్మెల్యేలు బీవీ జయనాగేశ్వరరెడ్డి, కేఈ శ్యాం బాబు, బొగ్గుల దస్తగిరి, ఆదోని ఇన్‌చార్జి మీనాక్షినాయుడు, మంత్రాలయం ఇన్‌చార్జి రాజశేఖర్‌రెడ్డి, ఆలూరు ఇన్‌చార్జి వీరభద్రగౌడ్, కేడీసీసీ బ్యాంక్ చైర్మెన్ విష్ణువర్ధనరెడ్డి, నాగేశ్వరరావుయాదవ్, తుగ్గలి నాగేంద్ర, కుడా చైర్మెన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు గౌరువెంకట రెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ చైర్మెన్ కప్పట్రాళ్ళ బొజ్జమ్మ, కురవకార్పొరేషన్ చైర్మెన్ దేవేంద్రప్ప, టీడీపీ నాయకులు కమ్మరాజశేఖర్, టీడీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ముంతాజ్, కేవీ సుబ్బారెడ్డి, కార్పొరేటర్ పద్మలతారెడ్డి, వివిధ కార్పొరేషన్ డైరెక్టర్‌లు, కర్నూలు కార్పొరేటర్‌లు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : కర్నూలు నియోజకవర్గ పరిధిలోని 19 వార్డుల్లో 31 రకాల అభివృద్ధి పనులకు శుక్రవారం రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ శంకుస్థాపనలు చేయనున్నారని నగరపాలక కమిషనర్ యస్.రవీంద్ర బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 15వ ఆర్థిక సంఘం, యస్‌క్యాప్, సాధారణ నిధులకు సంబంధించి మొత్తం రూ.12.30 కోట్లతో అభివృద్ధి పనులకు గురువారం సాయంత్రం 4 గంటల నుండి వివిధ అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు చేస్తారని కమిషనర్ పేర్కొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో నలుగురు డిబార్

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో ఉన్న డిగ్రీ కళాశాలలో రెండు సెమిస్టర్ పరీక్షల కోసం దరఖాస్తు 3913గాను 3499 పరీక్షలు రాశారని, నలుగురు డీబర్ అయినట్లు తెలిపారు. ఆరో సెమిస్టర్ పరీక్షలు 75 గాను 67 పరీక్షలు హాజరై అయినట్లు ఎగ్జామినేషన్ అధికారి వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. పరీక్షల నిర్వహణలో పకడ్బందీగా ఏర్పాటు చేశామన్నారు. నలుగురు విద్యార్థులు మాల్ ప్రాక్టీస్ కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రూసా పనుల నాణ్యతపై కమిటీ పరిశీలన

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ పురుషుల కళాశాల, సిల్వర్ జూబ్లీ కళాశాల, సుమారు రూ.55 కోట్లతో రూసా నిధులతో చేపట్టిన పనుల పురోగతి, నాణ్యతపై క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు అధ్యక్షతన కమిటీ హాల్ లో గురువారం ఉదయం సమావేశం నిర్వహించారు. ఈ కమిటీ బృందంలో రాయలసీమ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బోయ విజయకుమార్ నాయుడు, ద్రావిడ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వి కిరణ్ కుమార్, కడప ఆర్జెడిసిఈ డి.నాగలింగారెడ్డి, నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎన్. శశికళ, కడప సర్కిల్ ఏపీఈడబ్ల్యుఐడీసీ ఎస్‌ఈ ఎస్ శివకుమార్, ఏపీఎంఎస్‌ఐడిఎస్ ఈఈ కె.నివాస్ రెడ్డి బృందం బిల్డింగులను పరిశీలించింది. ఈ సమావేశంలో క్లస్టర్ యూనివర్సిటీ సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాస్, ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిరా శాంతి, కెవిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకట్ రెడ్డి, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్ పథకంపై అవగాహన కల్పించాలి

విశాలాంధ్ర - ఆస్పరి : మండలంలో పీఎం సూర్య ఘర్ పథకం కింద ప్రతి ఇంటి మీద సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకునేలా లబ్దిదారులకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో గీత వాణి, తహశీల్దార్ రామేశ్వర రెడ్డి మండల అధికారులకు సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పీఎం సూర్య ఘర్ పథకం, అంతర్జాతీయ యోగా దినోత్సవంపై మండల స్థాయి అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ పీఎం సూర్య ఘర్ పథకం కింద సోలార్ ప్యానల్ ఏర్పాటు పనులు వేగవంతం చేయాలన్నారు. మండలంలో పీఎం సూర్య ఘర్ పథకం కింద నలుగురు విద్యుత్ వినియోగదారులు తమ గృహాలపై సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకున్నారన్నారు. విద్యుత్తు వాడకాన్ని తగ్గించి, ప్రకృతి సహజ సిద్దంగా లభించే సోలార్ విద్యుత్ వినియోగం, ప్రభుత్వాలు కల్పిస్తున్న రాయితీపై మండలంలో విస్తృత అవగాహన కల్పించి ఎక్కువ సంఖ్యలో ప్రజలు సోలార్ ప్యానల్ తమ గృహాలపై ఏర్పాటు చేసుకునేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్ బాలకృష్ణారెడ్డి, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా రథోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - తుగ్గలి: మండల కేంద్రమైన తుగ్గలి సమీపాన అటవీ ప్రాంతంలో వెలసిన కిష్టాపురం ఆంజనేయ స్వామి రథోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు పలు జిల్లాలనుండే కాక కర్ణాటక, తెలంగాణ నుండి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.ఈ వేడుకలు వడ్డ వారి కుటుంబ సభ్యులు ప్రహ్లాద్,సీను, ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

మావోయిస్ట్ నేతల హత్యల పట్ల న్యాయ విచారణ జరిపించాలి

విశాలాంధ్ర - కర్నూలు : మావోయిస్ట్ పార్టీ కేంద్ర కార్యదర్శి నంబాల కేశవరావు, నాగేశ్వర రావు, ఇతర ఆదివాసీ మావోయిస్ట్ హత్యలపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని ప్రజాస్వామ్య సంఘాల ఐక్య వేదిక డిమాండ్ చేసింది. ఎన్ కౌంటర్ లను నిరసిస్తూ గురువారం పీఓ డబ్ల్యు కార్యాలయంలో ప్రజాసంఘాల సమావేశం జరిగింది. వేదిక కన్వీనర్ రామకృష్ణా రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించబడిన ఈ సమావేశంలో విరసం రాష్ట్ర కమిటీ సభ్యులు పాణి మాట్లాడుతూ ఇవాళ మావోయిస్ట్ పార్టీని మొత్తం నిర్మూలించడానికి కంకణం కట్టుకున్నదని, ఆపరేషన్ కగార్ పేరిట మావోయిస్ట్‌లతో పాటు, అమాయక ఆదివాసీ యువకులను చంపివేస్తున్నారని, అంతిమంగా ఈ దేశ సంపదలను దోపిడి చేయడం కొరకే ఈ హత్యలు చేస్తూ వుందని, ప్రజలు పెద్ద ఎత్తున నిరసన ఉద్యమాలలో పాల్గొన్నప్పుడే మనం ఇలాంటి హత్యలను నిరోధించగలుగుతామని పిలుపు నిచ్చారు. అనంతరం జిల్లా పౌర హక్కుల సంఘం కార్యదర్శి అల్లా బకాష్ మాట్లాడుతూ ఎక్కడో చికిత్స పొందుతూ వున్న కేశవ రావును బూటకపు ఎన్కౌంటర్ చేసిందని, మైదాన ప్రాంతం లోని ప్రజాస్వామిక వాదులు ప్రశ్నించాలని, పిలుపు నిచ్చారు. రైతు కూలీ సంఘం నాయకులు సుంకన్న మాట్లాడుతూ ఈ దేశ ప్రజలపై సొంత సైన్యం యుద్ధం చేయడం రాజ్యాంగ విరుద్ధమని, తక్షణమే అక్కడ ఉన్న సైన్యాన్ని బేషరతుగా ఉప సంహరించాలని, మావోయిస్ట్ నాయకులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ బాధ్యులు మహేష్, రాయలసీమ విద్యావంతుల వేదిక కన్వీనర్ భాస్కర రెడ్డి, ఇఫ్టూ నాయకులు నాగన్న, మాజీ పౌర హక్కుల సంఘం నాయకులు రాజా సాగర్, రత్నం ఏసేపు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను ఇవ్వాలి

విశాలాంధ్ర-పత్తికొండ: ఉపాధి హామీ కూలీలకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను తక్షణమే ఇవ్వాలని సిపిఐ ఎంపీటీసీ సభ్యులు పెద్ద ఈరన్న డిమాండ్ చేశారు. గురువారం మండల పరిషత్ సమావేశ భవనంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ నారాయణదాసు అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. సీపీఐ ఎంపీటీసీ సభ్యులు పెద్ద ఈరన్న పలు సమస్యలపై అధికారులను ప్రశ్నించారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ లో రైతులు పంటలు సాగు చేసుకునేందుకు 90 శాతం సబ్సిడీతో విత్తనాలు, ఎరువులు పంపిణీ చేయాలన్నారు. మండలంలోని దూదేకొండలో కర్నూలు రోడ్డు, ప్రధాన కాలనీలో 10 ఇళ్లకు మండల గ్రాంట్ నిధులను ఉపయోగించి తాగునీటి కుళాయిలు వేయాలని డిమాండ్ చేశారు. సర్వసభ్య సమావేశానికి ఆర్ అండ్ బి అధికారులు హాజరు కాకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. దూదేకొండ సర్పంచ్ రహిమాన్, చిన్నహుల్తి సర్పంచ్ కేశవ రెడ్డి మాట్లాడుతూ గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు సమన్వయంతో పనిచేసే విధంగా సంబంధిత అధికారులను కోరారు. వివిధ శాఖల అధికారులు ఆయా శాఖల పనితీరు పై నివేదికను సమావేశంలో వివరించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో కవిత, మండల అధికారులు వైస్ ఎంపీపీ రంగమ్మ, కోఆప్షన్ సభ్యులు నజీర్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువతి మృతి

విశాలాంధ్ర - ఆస్పరి: తాగునీరు పట్టుకునేందుకు మోటర్ ఆన్ చేయడానికి వెళ్ళిన యువతి ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన విషాదకరమైన ఘటన మండల కేంద్రం ఆస్పరిలో గురువారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు పింజరి బీబీ, కాశన్న దంపతులకు నలుగురు ఆడపిల్లల సంతానం. వీరిలో ఇద్దరికీ వివాహాలయ్యాయి. మూడవ సంతానం షబేరా (20). ఇటీవల ములగుంద గ్రామానికి చెందిన వారితో వచ్చే నెల 22, 23వ తేదీ వివాహం నిశ్చితార్థం ఖరారు అయింది. గురువారం ఉదయం గ్రామపంచాయతీ వారు తాగునీటినీ విడుదల చేశారు. అందులో భాగంగా మంచి నీటిని పట్టుకునేందుకు మోటార్ ఆన్ చేసే సమయంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై పెద్దగా కేకలు వేసి కింద పడిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు హుటా హుటినా ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చేసినట్లు వైద్యులు నిర్ధారించారు. ఎదిగిన కూతురు మృత దేహాన్ని చూసి తల్లిదండ్రులు కంటతడిపెట్టిన తీరు అందరిని కలిచివేసింది. యువతి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

24న జీ తెలుగు అప్సర అవార్డ్స్

విశాలాంధ్ర - కర్నూలు: వెండితెర, బుల్లితెర తారల సందడితో వైభవంగా జరిగిన జీ తెలుగు అప్సర అవార్డ్స్ ఈ నెల 24 వ తేది సాయంత్రం 5:30 గంటలకు మీ జీ తెలుగులో ప్రసారం కానుందని సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. అంగరంగ వైభవంగా జరిగిన ఈ కార్యక్రమానికి ఎనర్జిటిక్ యాంకర్స్ సుధీర్, రవి వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. ఆద్యంతం ఆసక్తికరంగా సాగిన ఈ కార్యక్రమంలో డ్రామా జూనియర్స్ పిల్లలు చిరంజీవి, బాలకృష్ణ గెటప్‌లో వేదికపైకి వచ్చి ప్రముఖ నటి రోజాకు అవార్డు అందించారు. జయప్రద, ఐశ్వర్య రాజేష్, అనిల్ రావిపూడితో కలిసి సంక్రాంతికి వస్తున్నాం సినిమాలోని సీన్ని రీక్రియేట్ చేశారు. అమల అక్కినేని రవి, రోజాతో కలిసి డాన్స్ చేయడమే కాకుండా, జంతు సంరక్షణ, నాగార్జున, నాగచైతన్య, అఖిల్ గురించి పలు విషయాలు పంచుకున్నారు. జయసుధకు అభిమానులు ఆటోగ్రాఫ్‌లతో అలంకరించిన చీరను బహుమతిగా ఇచ్చారు. రమ్యకృష్ణ నటించిన ప్రముఖ పాత్రలతో ఓ చక్కని ప్రదర్శన ఇచ్చారు. ఘనంగా జరిగిన ఈ వేడుకలో టాలీవుడ్ ప్రముఖులైన సంయుక్త మీనన్, మీనాక్షి చౌదరి, మురళీ మోహన్, అన్నపూర్ణ, స్వప్న దత్, ప్రియాంక దత్, జీవిత రాజశేఖర్, శివాని రాజశేఖర్, సుమ కనకాల, కోన వెంకట్, నిహారిక కొణిదెల, అనసూయ, డైరెక్టర్ నందిని రెడ్డి, రజిత, ప్రగతితో పాటు మరికొందరు నటీనటులు పాల్గొని సందడి చేశారు.

మున్సిపల్ ఛైర్మన్‌కు సన్మానం

విశాలాంధ్ర - ఆదోని రూరల్: ఆదోని మున్సిపల్ కార్పొరేషన్ లో మున్సిపల్ చైర్ పర్సన్ పదవికి అవిశ్వాస తీర్మానం పెట్టిన తర్వాత నూతనంగా మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన సీహెచ్ లోకేశ్వరిని చైర్ పర్సన్ చాంబర్లో ఏపీవిబిఎస్ ఆదోని మండల అధ్యక్షుడు ఆరెకల్ నాగరాజు ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకులు ఆరెకల్ హనుమేష్, రామకృష్ణ, వీరేష్ నాయుడు, వెంకటేష్, చిగిలి ఈరన్న పలువురుతో కలిసి గురువారం శాలువ కప్పి పూలమాలతో ఘనంగా సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆరెకల్ నాగరాజు మీడియాతో మాట్లాడుతూ వాల్మీకి బోయ కులస్తులు వివిధ రంగాలతో పాటు రాజకీయరంగంలో ఎదగాలని ఆకాంక్షించారు. ఏ రాజకీయ పార్టీలోనైనా వాల్మీకి బోయలు ప్రత్యేక స్థానం సంపాదించుకోవాలని సూచించారు. వైసీపీలో మాజీ శాసనసభ్యులు సాయి ప్రసాద్ రెడ్డి వాల్మీకి బోయలను గుర్తించి మున్సిపల్ చైర్ పర్సన్‌గా రెండుసార్లు అవకాశం ఇవ్వడం ఎంతగానో హర్షించదగ్గ విషయమని కృతజ్ఞతలు తెలిపారు. వాల్మీకి బోయలకు మంచి పదవులు ఇచ్చి ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదిగెందుకు సహకరించాలని వివిధ రాజకీయ పార్టీల ముఖ్య నాయకులను కోరారు.

రాష్ట్ర ప్రభుత్వ ట్రైబల్ అడ్వైజర్ కౌన్సిల్‌గా పి.వెంకటపతి



విశాలాంధ్ర - తుగ్గలి: రాష్ట్ర ప్రభుత్వ ట్రైబల్ అడ్వైజర్ కౌన్సిల్‌గా పి.వెంకటపతిని నియమిస్తూ గురువారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేశారు. మండల పరిధిలోని కొత్తపల్లి గుడిసెలు గ్రామానికి చెందిన పి.వెంకటపతి రాష్ట్ర టిడిపి ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఉన్నారు. ఎమ్మెల్యే కేఈ శ్యామ్ కుమార్‌కు నమ్మిన బంటుగా వెంకటపతి ఉన్నారు. దీంతో ఆయనకు రాష్ట్ర ట్రైబల్ అడ్వైజర్ కౌన్సిల్‌గా నియమించారు. దీంతో మండలానికి చెందిన టిడిపి నాయకులు బత్తిన దేవేంద్ర, గిరిగేట్ల బలరాముడు, అమీనాబాద్ సతీష్ చౌదరి, చేన్నంపల్లి అక్బర్ బాషా తదితరులు హర్షం ప్రకటించారు.

మైనర్ ఇరిగేషన్ చెరువుల మరమ్మతులు, పునరుద్ధరణకు ప్రతిపాదనలు

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : జిల్లాలో ఉన్న చిన్న నీటిపారుదల చెరువులకు సంబంధించి మరమ్మతులు, తదితర పునరుద్ధరణ పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో వాటర్ బాడీస్‌కు సంబంధించిన రిపేర్, రెనొవేషన్, రెస్టొరేషన్ స్కీం జిల్లా స్థాయి ఇంప్లిమెంటేషన్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆర్ఆర్ఆర్ స్కీం కింద చిన్న నీటి పారుదల చెరువులకు మరమ్మత్తులు, పునరుద్ధరణ పనులు చేపట్టేందుకు అవకాశం ఉందన్నారు. ఆర్ఆర్ఆర్ స్కీం ద్వారా కేంద్రం నుండి 60 శాతం, రాష్ట్రం నుండి 40 శాతం నిధులతో ఈ పనులు చేపట్టడం జరుగుతుందన్నారు.. ఇందుకు సంబంధించి జిల్లాలో ఉన్న చిన్న నీటి పారుదల చెరువులకు మరమ్మత్తులు, పునరుద్ధరణ పనులు చేపట్టేందుకు తగిన అంచనాలను రూపొందించాలని కలెక్టర్ జల వనరుల శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జలవనరుల శాఖ ఎస్ ఈ బాలచంద్రారెడ్డి, ఎంఐ వర్క్స్ డివిజన్ ఈఈ శ్రీనివాసులు, ఆర్ డబ్ల్యూ ఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, గ్రౌండ్ వాటర్ డిడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

విశాలాంధ్ర - పెద్దకడబూరు: మండల కేంద్రంలో హనుమాన్ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వ హిం చారు. స్థానిక గ్రామ చావిడి వద్ద నుంచి పాతూరి ఆంజనేయస్వామి చిత్రపటాన్ని కలశాలతో, మంగళ వాయి ద్యాలతో పురవీధుల గుండా ఊరేగింపుగా ఆంజనేయస్వామి దేవాల యానికి తీసుకెళ్లారు. ఉదయం ఆలయ పూజారి బసవరాజు స్వామి వారికి ఆకు పూజ, జలాభిషేకము, పంచామృతాభిషేకం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అన్నదాన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి బజన కార్యక్రమం నిర్వ హించారు. ఆలయ ధర్మకర్త కురువ గుడిసె లింగన్న, పెద్దలు జెల్లి హనుమన్న, జెల్లి రామాంజనేయులు, కె.టి.ఉరుకుందప్ప, కృష్ణ మూర్తి, గుంటెప్ప, ఆవుల రంగన్న, మురవణి ఆంజనేయ పాల్గొన్నారు.

విశాలాంధ్ర-గూడూరు: మండల వ్యాప్తంగా హను మాన్ జయంతి వేడుకలను ప్రజలు వైభవంగా జరుపు కున్నారు. గురువారం హనుమాన్ జయంతి వేడుకలు పురస్కరించుకొని గూడూరు పట్టణము, చనుగొండ్ల గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయంలో స్వామివారికి ఆకు పూజ అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆంజనేయస్వామి విగ్రహాన్ని పల్లకిలో ఉంచి మేళ తాళాలతో ఊరేగింపుగా కొనసాగించారు. భక్తులు భారీగా సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

విశాలాంధ్ర - కోడుమూరు: పట్టణంలో శ్రీ హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. హనుమాన్ జయంతి పురస్కరించుకొని హనుమాన్ శోభాయాత్ర కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వందలాది మంది యువతతో బైక్ ర్యాలీ చేపట్టారు. గురువారం సాయంత్రం పట్టణంలోని స్థానిక తుంగభద్ర ప్రాజెక్టు కాలువ కార్యాలయ ఆవరణంలోనీ శ్రీ అభయాంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి ప్రత్యేక వాహనంకు ముందు భాగాన హనుమాన్ భారీ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి యువకులందరూ జైశ్రీరామ్ జైశ్రీరామ్ అంటూ ఎంతో భక్తిశ్రద్ధలతో బైకులకు భారీ జెండాలు కట్టుకొని పట్టణ పురవీధుల్లో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. శోభయాత్ర కమిటీ సభ్యులు నక్రా నాగేశ్వరరావు, తాయప్ప పెనుమాడ కిరణ్, అశోక్ తదితరుల ఆధ్వర్యంలో చేపట్టిన హనుమాన్ శోభాయాత్రను శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రధాన సేవకుడు ఎద్దుల మహేశ్వరరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. మండలంలోని ఆయా గ్రామాల్లోని ఆంజనేయస్వామి దేవాలయాల వద్ద భక్తులు ఎంత భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఉహనుమాన్ జయంతి సందర్భంగా స్థానిక టిడిపి కాలనీ, చిన్న బోయగేరి, సాయిబాబా గుడి వద్ద, ఎంపీడీవో కార్యాలయ ఆవరణలోని ఆంజనేయస్వామి ఆలయాల వద్ద భక్తులకు తీర్థప్రసాదులు అందజేసి, పెద్ద ఎత్తున అన్న ప్రసాద వితరణ చేపట్టారు. పట్టణంలోని స్థానిక మాధవ ఆంజనేయస్వామి ఆలయ నిర్వాహకులు, సాయంత్రం స్వామివారికి పల్లకి సేవ నిర్వహించారు.

ఘనంగా వెంకటగిరి గిడ్డాంజేనేయస్వామి రథోత్సవం : శ్రీ హనుమాన్ జయంతి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని వెంకటగిరి గ్రామంలో వెలసిన శ్రీ గిడ్డాంజేనేయస్వామి రథోత్సవ వేడుకలను ఎంతో భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. రథోత్సవ కార్యక్రమాన్ని తిలకించేందుకు మండలంలోని గ్రామస్తులతో పాటు ఆయా గ్రామాల ప్రజలు,భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

మరిన్ని వార్తలు E-PAPERలో..

కార్యసాధకుడికి హనుమంతుడే ఆదర్శం

విశాలాంధ్ర - జూపాడుబంగ్లా: కార్యసాధకుడికి హనుమంతుడే ఆదర్శమని, ప్రత్యేకించి యువత ఆశించిన లక్ష్యాన్ని చేరుకోవాలంటే హనుమంతుని పట్టుదల పరాక్రమం అలవరచుకోవాలని తెలుగు పండితులు, ధార్మిక ప్రవచకులు పార్వతి అన్నారు. హనుమజ్జయంతిని పురస్కరించుకుని గురువారం పారుమంచాల, జూపాడుబంగ్లాలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానం నందు తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచారపరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధార్మిక సభా కార్యక్రమంలో హనుమంతుని గుణ పరాక్రమాలపై వారు ప్రసంగించారు. ఈ సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకట రెడ్డి మాట్లాడుతూ సమాజాన్ని ప్రత్యేకించి యువత సరైన మార్గంలో నడవాలంటే బాల్యంనుండే ధార్మిక చింతనను అలవరచుకోవాలని పిలుపునిచ్చారు. ముందుగా ఆంజనేయ స్వామికి సింధూరాభిషేకం, ఆకుపూజ, విశేషార్చన, స్థానిక భజన మండలిచే హనుమాన్ ఛాలీసా పారాయణం నిర్వహించి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు శేష భట్టాచార్యులు జితేంద్రయ్య, పోచా లోకేశ్వర్ రెడ్డి, మండ్ల పాలరాముడు, జనార్ధన్ రెడ్డి, దివాకర్ రెడ్డి, మండడి సుబ్బారెడ్డి, ఆంజనేయులు, వెంకటస్వామి, వెంకటరమణ, వుల్లయ్య, శేఖరు, హరి, శేఖర్ నాయుడు, సాములు, చిన్న స్వాములు, చిన్న బాబయ్య, సురేశ్, వెంకటేశ్వర్లు, రమణయ్య, చెన్నప్ప నాయుడు, జోగి ఆంజనేయులు, పిండి వెంకటేశ్వర్లు, సీతారామాంజనేయ స్వామి భజన మండలి బృందం, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్ర క్యాంపెయిన్ విజయవంతంగా నిర్వహించాలి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : మే 22 నుండి జూన్ 21 వ తేది వరకు జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుండి యోగాంధ్ర క్యాంపెయిన్ అంశంపై స్పెషల్ ఆఫీసర్లు, డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మే 22 నుండి జూన్ 21వ తేది వరకు యోగాంధ్ర కార్యక్రమంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించేలా ప్రతి రోజు యోగాకి సంబంధించిన కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉండాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం జూన్ 22 వరకు ప్రతి రోజు ఒక జిల్లాలో ఒక థీమ్ తో స్టేట్ ఈవెంట్ యోగా సెషన్ ను నిర్వహించేలా ప్రణాళిక సిద్ధం చేసిందన్నారు. జూన్ 17న కర్నూలు జిల్లాలో 5 వేల మంది పారిశుధ్య కార్మికులతో యోగా కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ కర్నూలు మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. జూన్ 8వ తేదీన కర్నూలు, ఆదోని, పత్తికొండ డివిజన్‌లలోని 3 ప్రదేశాల్లో సీనియర్ సిటిజన్లతో యోగా కార్యక్రమాలను నిర్వహించాలని, అందుకు సంబంధించిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదోని సబ్ కలెక్టర్, కర్నూలు, పత్తికొండ ఆర్డీఓలను ఆదేశించారు. పర్యాటక ప్రాంతాల్లో యోగా కార్యక్రమాలను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఇందులో భాగంగా కొండారెడ్డి బురుజు దగ్గర, ఓర్వకల్లు రాక్ గార్డెన్, నగర్ వనం, మంత్రాలయం లలో మే 30, జూన్ 5, జూన్ 12, జూన్ 18వ తేదీలలో ప్రత్యేక యోగా కార్య క్రమాలను నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదోని సబ్ కలెక్టర్, కర్నూలు ఆర్డీఓను, డిఎఫ్ఓను, ఓర్వకల్లు ఎంపిడిఓలను ఆదేశించారు. దాదాపు వెయ్యి మందితో ఈ కార్యక్రమాలను నిర్వహించాల్సి ఉందని, అందుకోసం సంబంధిత మండలాల ఎంపిడిఓ లతో కోఆర్డినేట్ చేసుకొని కార్య క్రమాలను నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్లో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, కర్నూలు ఆర్డీవో సందీప్, పత్తికొండ ఆర్డీఓ భరత్, అన్ని మండలాల ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేను పరిశీలించిన జాయింట్ కలెక్టర్

విశాలాంధ్ర - బనగానపల్లె: మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామములో జరుగుతున్న రీసర్వేను క్షేత్ర స్థాయిలో జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ పరిశీలించడం జరిగింది. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ నిర్ణిత గడువులో అధికారులు రీసర్వేను పూర్తి చేయాలని ఆదేశించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ నారాయణరెడ్డి, సర్వేర్ మురళి రెవెన్యూ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : కర్నూలు నియోజకవర్గ పరిధిలోని 19 వార్డుల్లో 31 రకాల అభివృద్ధి పనులకు శుక్రవారం రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ శంకుస్థాపనలు చేయనున్నారని నగరపాలక కమిషనర్ యస్.రవీంద్ర బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 15వ ఆర్థిక సంఘం, యస్‌క్యాప్, సాధారణ నిధులకు సంబంధించి మొత్తం రూ.12.30 కోట్లతో అభివృద్ధి పనులకు గురువారం సాయంత్రం 4 గంటల నుండి వివిధ అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు చేస్తారని కమిషనర్ పేర్కొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో నలుగురు డిబార్

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో ఉన్న డిగ్రీ కళాశాలలో రెండు సెమిస్టర్ పరీక్షల కోసం దర ఖాస్తు 3913గాను 3499 పరీక్షలు రాశారని, నలుగురు డీబర్ అయినట్లు తెలిపారు. ఆరో సెమిస్టర్ పరీక్షలు 75 గాను 67 పరీక్షలు హాజరై అయినట్లు ఎగ్జామినేషన్ అధికారి వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. పరీక్షల నిర్వహణలో పకడ్బందీగా ఏర్పాటు చేశామన్నారు. నలుగురు విద్యార్థులు మాల్ ప్రాక్టీస్ కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రూసా పనుల నాణ్యతపై కమిటీ పరిశీలన

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: క్లస్టర్ యూనివర్సిటీ పరిధి లోని ప్రభుత్వ పురుషుల కళాశాల, సిల్వర్ జూబ్లీ కళాశాల, సుమారు రూ.55 కోట్లతో రూసా నిధులతో చేపట్టిన పనుల పురోగతి, నాణ్యతపై క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు అధ్యక్షతన కమిటీ హాల్ లో గురువారం ఉదయం సమావేశం నిర్వహించారు. ఈ కమిటీ బృందంలో రాయలసీమ యూని వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బోయ విజయకుమార్ నాయుడు, ద్రావిడ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వి కిరణ్ కుమార్, కడప ఆర్జెడిసిఈ డి.నాగలింగారెడ్డి, నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎన్. శశికళ, కడప సర్కిల్ ఏపీఈడబ్ల్యూఐడీసీ ఎస్ఈ ఎస్ శివకుమార్, ఏపీఎంఎస్ఐడిఎస్ ఈఈ కె.నివాస్ రెడ్డి బృందం బిల్డింగులను పరిశీలించింది. ఈ సమావేశంలో క్లస్టర్ యూనివర్సిటీ సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాస్, ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిరా శాంతి, కెవిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకట్ రెడ్డి, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్ పథకంపై అవగాహన కల్పించాలి

విశాలాంధ్ర - ఆస్పరి : మండలంలో పీఎం సూర్య ఘర్ పథకం కింద ప్రతి ఇంటి మీద సోలార్ ప్యానల్ ఏర్పా టు చేసుకునేలా లబ్ధిదా రులకు అవగాహన కల్పించాలని ఎంపీ డీవో గీత వాణి, తహశీల్దార్ రామేశ్వర రెడ్డి మండల అధికారులకు సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పీఎం సూర్య ఘర్ పథకం, అంతర్జాతీయ యోగా దినోత్సవంపై మండల స్థాయి అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ పీఎం సూర్య ఘర్ పథకం కింద సోలార్ ప్యానల్ ఏర్పాటు పనులు వేగవంతం చేయాలన్నారు. మండలంలో పీఎం సూర్య ఘర్ పథకం కింద నలుగురు విద్యుత్ వినియోగదారులు తమ గృహాలపై సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకున్నారన్నారు. విద్యుత్తు వాడకాన్ని తగ్గించి, ప్రకృతి సహజ సిద్ధంగా లభించే సోలార్ విద్యుత్ వినియోగం, ప్రభుత్వాలు కల్పిస్తున్న రాయితీపై మండలంలో విస్తృత అవగాహన కల్పించి ఎక్కువ సంఖ్యలో ప్రజలు సోలార్ ప్యానల్ తమ గృహాలపై ఏర్పాటు చేసుకునేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్ బాలకృష్ణారెడ్డి, మండల స్థాయి అధికారులు, పంచా యతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

రాంకోలో అగ్ని ప్రమాదం

విశాలాంధ్ర - కొలిమి గుండ్ల: మండలంలోని కలవటాల గ్రామ పరిది.లో నిన్న రాంకో సిమెంట్ పరిశ్రమలో బుధవారం సాయంత్రం అగ్నిప్రమా దం చోటు చేసుకుంది. రాంకో ఫ్యాక్టరీలో పనుల్లో భాగంగా ఓ కార్మికుడు వెల్డింగ్ వేస్తుండగా ఆకస్మి కంగా మంటలు చెలరే గాయి. దీంతో సమీపంలోనే సిలిండర్లు ఉండడంతో కార్మికులు భయాందోళన చెందారు. ఆ ప్రాంతంలోఅగ్నికీలకలు పెద్ద ఎత్తున ఎగిసిపడి దట్టమైన పొగలు అలుముకున్నాయి. దీంతో ఆ ప్రాంతంలో ఏం జరుగుతుందో కొద్దిసేపు కార్మికులకు అర్థం కాక తీవ్ర భయాందోళన చెందారు. రాంకో ఫైర్ ఇంజన్‌తో పాటు అల్ట్రాటెక్ ఫైరింజన్లు ప్రమాద ఘటన ప్రాంతానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఇతర ప్రాంతాలకు మంటలు వ్యాపించకపోవడంతో పాటు, కార్మికులు సురక్షితంగా బయటపడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

అటాహసంగా మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రమాణస్వీకారం

విశాలాంధ్ర - నందికొట్కూరు : నందికొట్కూరు మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా బొల్లవరం గ్రామానికి చెందిన రైతుబిడ్డ మాజీ ఎంపీపీ వీరం ప్రసాద్ రెడ్డి, కమిటీ సభ్యులు గురువారం స్థానిక మార్కెట్ యార్డ్ నందు అటహాసంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, నంద్యాల టీడీపీ పార్లమెంట్ ఇంచార్జి మాండ్ర శివ నంద రెడ్డి, నియోజవర్గ ఎమ్మెల్యే గిత్త జయ సూర్య హాజరు కావడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ నందికొట్కూరు నియోజవర్గంలో మంచి యంగ్ డైనమిక్ ఎమ్మెల్యే జయ సూర్య ఉండడం అదృష్టమన్నారు. ఎప్పుడు నియోజవర్గ సమస్యల కోసం ఫైళ్ళ కట్ట సంకన పెట్టుకొని మంత్రుల కాడికి వచ్చి నియోజవర్గ సమస్యలను వినిపించి పట్టుదలతో సాధించుకొని వెళ్లడం జరుగుతుందన్నారు. ఇలాంటి ఎమ్మెల్యేను అందించిన మాండ్ర శివానందరెడ్డికి మీ నియోజవర్గ ప్రజలు ఎప్పుడు రుణపడి ఉండాలన్నారు. రైతు బిడ్డ రైతుల సమస్యలు తెలిసినటువంటి మాజీ ఎంపీపీ ప్రసాద్ రెడ్డిని మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా ఎన్నుకోవడం హర్షించదగ్గ విషయమన్నారు. వీరి ఇరువురు మాండ్ర సమక్షంలో నియోజవర్గ అభివృద్ధికి కృషి చేస్తారని, తనవంతుగా నియోజకవర్గ అభివృద్ధికి ఎల్లవేళలా అండగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కడియం శ్రీనివాసులు, మున్సిపల్ వైస్ చైర్మన్ మొల్ల రబ్బాని, కౌన్సి లర్లు జాకీర్ హుస్సేన్, భాస్కర్ రెడ్డి, జనసేన నియోజవర్గ అధ్యక్షులు రవికుమార్, జెపి నాయకులు దామోదర్ రెడ్డి, మిడుతూరు మండల కన్వీనర్ ఖాతా రమేష్ రెడ్డి, గిరీష్ రెడ్డి, దామోదర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, వడ్డేమాన్ సత్యం రెడ్డి, నియోజవర్గ టిడిపి నాయకులు ముఖ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి చేతుల మీదుగా షైనింగ్ స్టార్స్ అవార్డు ప్రధానం

విశాలాంధ్ర - పాములపాడు : పదో తరగతి టాపర్లను సత్కరించడానికి షైనింగ్ స్టార్స్ అనే కార్యక్రమాన్ని మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేష్ ఉండవల్లిలోని తన నివాసంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అత్యున్నత మార్కులు సాధించిన 47 మంది విద్యార్థులను లోకేష్ షైనింగ్ స్టార్స్ అనే అవార్డులతో సత్కరించారు. ఈ అవార్డు వచ్చిన వారిలో పాములపాడు మోడల్ స్కూల్ పదో తరగతిలో 593 మార్కులు సాధించిన మల్లన్న, 591 మార్కులు సాధించిన జాల యశశ్విని ఉన్నారని మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ నాగ రవీంద్ర గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సాధించిన విజయం ప్రభుత్వ పాఠశాలల బలాన్ని చూపిస్తుందని అంటూ, అత్యున్నత ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆంధ్రప్రదేశ్ విద్యా వ్యవస్థకు బ్రాండ్ అంబాసిడర్లు అని ఐటీ శాఖ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారని ప్రిన్సిపాల్ తెలి. పదో తరగతిలో రాష్ట్రం లెవెల్లో షైనింగ్స్ స్టార్ అవార్డును మన పాఠశాల ఇద్దరూ విద్యార్థులు సాధించడం హర్షనించదగ్గ విషయమని, మంచి మార్కుల కోసం కష్టపడి చదివిన విద్యార్థులను, ప్రోత్సహించిన తల్లిదండ్రులను, వారి ప్రతిభకై అనునిత్యం కృషిచేసిన ఉపాధ్యాయులను అభినందించారు. ఈ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఈ ఇద్దరు విద్యార్థులు ఇద్దరు స్ఫూర్తిగా ఉంటారని అన్నారు.

మావోయిస్ట్ నేతల హత్యల పట్ల న్యాయ విచారణ జరిపించాలి

విశాలాంధ్ర - కర్నూలు : మావోయిస్ట్ పార్టీ కేంద్ర కార్యదర్శి నంబాల కేశవరావు, నాగేశ్వర రావు, ఇతర ఆదివాసీ మావోయిస్ట్ హత్యలపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని ప్రజాస్వామ్య సంఘాల ఐక్య వేదిక డిమాండ్ చేసింది. ఎన్ కౌంటర్ లను నిరసిస్తూ గురువారం పీఓ డబ్ల్యు కార్యాలయంలో ప్రజాసంఘాల సమావేశం జరిగింది. వేదిక కన్వీనర్ రామకృష్ణా రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించబడిన ఈ సమావేశంలో విరసం రాష్ట్ర కమిటీ సభ్యులు పాణి మాట్లాడుతూ ఇవాళ మావోయిస్ట్ పార్టీని మొత్తం నిర్మూలించడానికి కంకణం కట్టుకున్నదని, ఆపరేషన్ కగార్ పేరిట మావోయిస్టలతో పాటు, అమాయక ఆదివాసీ యువకులను చంపివేస్తున్నారని, అంతిమంగా ఈ దేశ సంపదలను దోపిడి చేయడం కొరకే ఈ హత్యలు చేస్తూ వుందని, ప్రజలు పెద్ద ఎత్తున నిరసన ఉద్యమాలలో పాల్గొన్నప్పుడే మనం ఇలాంటి హత్యలను నిరోధించగలుగుతామని పిలుపు నిచ్చారు. అనంతరం జిల్లా పౌర హక్కుల సంఘం కార్యదర్శి అల్లా బకాష్ మాట్లాడుతూ ఎక్కడో చికిత్స పొందుతూ వున్న కేశవ రావును బూటకపు ఎన్కౌంటర్ చేసిందని, మైదాన ప్రాంతం లోని ప్రజాస్వామిక వాదులు ప్రశ్నించాలని, పిలుపు నిచ్చారు. రైతు కూలీ సంఘం నాయకులు సుంకన్న మాట్లాడుతూ ఈ దేశ ప్రజలపై సొంత సైన్యం యుద్ధం చేయడం రాజ్యాంగ విరుద్ధమని, తక్షణమే అక్కడ ఉన్న సైన్యాన్ని బేషరతుగా ఉప సంహరించాలని, మావోయిస్ట్ నాయకులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ బాధ్యులు మహేష్, రాయలసీమ విద్యావంతుల వేదిక కన్వీనర్ భాస్కర రెడ్డి, ఇఫ్టూ నాయకులు నాగన్న, మాజీ పౌర హక్కుల సంఘం నాయకులు రాజా సాగర్, రత్నం ఏసేపు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను ఇవ్వాలి

విశాలాంధ్ర-పత్తికొండ: ఉపాధి హామీ కూలీలకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను తక్షణమే ఇవ్వాలని సిపిఐ ఎంపీటీసీ సభ్యులు పెద్ద ఈరన్న డిమాండ్ చేశారు. గురువారం మండల పరిషత్ సమావేశ భవనంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ నారాయణదాసు అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. సీపీఐ ఎంపీటీసీ సభ్యులు పెద్ద ఈరన్న పలు సమస్యలపై అధికారులను ప్రశ్నించారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ లో రైతులు పంటలు సాగు చేసుకునేందుకు 90 శాతం సబ్సిడీతో విత్తనాలు, ఎరువులు పంపిణీ చేయాలన్నారు. మండలంలోని దూదేకొండలో కర్నూలు రోడ్డు, ప్రధాన కాలనీలో 10 ఇళ్లకు మండల గ్రాంట్ నిధులను ఉపయోగించి తాగునీటి కుళాయిలు వేయాలని డిమాండ్ చేశారు. సర్వసభ్య సమావేశానికి ఆర్ అండ్ బి అధికారులు హాజరు కాకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. దూదేకొండ సర్పంచ్ రహిమాన్, చిన్నహుల్తి సర్పంచ్ కేశవ రెడ్డి మాట్లాడుతూ గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు సమన్వయంతో పనిచేసే విధంగా సంబంధిత అధికారులను కోరారు. వివిధ శాఖల అధికారులు ఆయా శాఖల పనితీరు పై నివేదికను సమావేశంలో వివరించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో కవిత, మండల అధికారులు వైస్ ఎంపీపీ రంగమ్మ, కోఆప్షన్ సభ్యులు నజీర్ పాల్గొన్నారు.

వేతనాలు విడుదల చేయకపోతే ఛలో విజయవాడ

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : రాష్ట్రవ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించి ముందుకు నడిపిస్తున్న సిబ్బందికి నేటి వరకు 14 నెలలుగా వేతనాలు విడుదల చేయకపోవడం వల్ల వారి కుటుంబాలు పూట గడవక అగమ్య గోచర మయ్యాయని, తక్షణమే పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందో ళనలతో పాటు ఛలో విజయవాడ చేపడుతామని ఏపీ ప్రకృతి వ్యవసాయ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ బాబు హెచ్చరించారు. నంద్యాల ఆర్‌వైఎస్ఎస్ కార్యాలయంలో ఉద్యోగులతో కలిసి డీపీఎంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 14 వేల మంది ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులకు 12 నెలలుగా వేతనాలు ఇవ్వకుంటే వారి కుటుంబాలు ఎలా గడుస్తాయని నిలదీశారు. ప్రభుత్వ ఉద్యోగులకు రెండు నెలలు వేతనాలు రాకుంటేనే పూట గడవడం ఇబ్బందిగా ఉందని, ఇన్ని నెలలు పెండింగ్ లో ఉంచడం వల్ల మహిళా ఉద్యోగులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పెండింగ్ వేతనాలు విడుదల చేయకపోతే ఆర్‌వైఎస్ఎస్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్షకు సిద్ధమ న్నారు. వేతనాలు విడుదల చేయకుండా ఇబ్బం దులకు గురి చేయడం తగద న్నారు. పింఛన్ సౌకర్యం కల్పిం చాలన్నారు. పిఎసిఎస్ఐ సౌకర్యం కల్పించి ఎస్ఆర్ పాలసీ అమలు చేయాలని కోరారు. వేతనాలు విడుదల కానీ పక్షంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళనకి పిలుపు ఇస్తామన్నారు. ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆలయాల్లో అంజన్న జయంతి వేడుకలు

విశాలాంధ్ర - ఉయ్యాలవాద: ఉయ్యాలవాడ మండలంలోని అన్ని గ్రామాలలో గురువారం నాడు హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. హనుమంతుడు జన్మించిన రోజు కావడంతో ఈ పర్వదినాన్ని పురస్కరించుకొని ఆంజనేయ స్వామి దేవాలయాలలో స్వామివారికి ప్రత్యేకంగా అలంకరణ చేసి అభిషేకం కుంకుమార్చన, ఆకు పూజ, పంచామృతాభిషేకం సింధూరభిషేకం స్వామివారికి వరమాల నవగ్రహ పూజ అనంతరం వచ్చిన భక్తులందరికీ స్వామివారి తీర్థ ప్రసాదాలు పానకం వడపప్పు స్వామివారి దీవెనలు అందించారు. ఆర్.జమ్ములదిన్నె గ్రామంలోని దేవాలయంలో అర్చకులు కీర్తి లక్ష్మీ స్వామి ఉయ్యాలవాడలోని ఆంజనేయ స్వామి దేవాలయం అర్చకులు భాస్కర్ శర్మ ఆయా గ్రామాల్లోని అర్చకులు తెల్లవారు జాము నుండి స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపించారు. అన్ని గ్రామాలలోని ఆలయాల వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు.

విశాలాంధ్ర - చాగలమర్రి : మండలం లోని మూడురాళ్లపల్లె గ్రామ సమీపంలో వెలసిన అంభాపురం అభయాంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలను అత్యంత వైభవంగా జరిపారు. ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, ఆకు పూజలు నిర్వహించారు. చిన్నారులచే ప్రత్యేక కోలాటం ప్రదర్శన నిర్వహించారు. మధ్యాహ్నం చెక్కభజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు వందలాదిగా తరలి వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

విశాలాంధ - బనగానపల్లె: పట్టణంలో మండల వ్యాప్తంగా శ్రీ రామ భక్త హనుమాన్ జయంతి వేడుకలు అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా జరిగాయి. శ్రీరామ నామస్మరణతో ఆలయ ప్రాంగణాలు మార్మోగాయి. వేకువజామునే గర్భాలయంలో స్వామి వారి మూలవిగ్రహానికి ఆలయ అర్చకులు వివిధ ఫల, పుష్పాలతో విశేష అలంకారాలు చేసి అర్చనలు, అభిషేకాలు చేసి స్వామివారిని భక్తులకు దర్శనం కల్పించారు. మండలంలోని పలు హనుమాన్, రామాలయాలకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బనగానపల్లి పట్టణంలోని రవ్వల కొండపై వెలసిన శ్రీ బాలాంజనేయ దేవస్థానంలో బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సతీమణి కాటసాని జయమ్మలు ఆలయానికి వచ్చి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కొండపేట పెద్ద ఆంజనేయస్వామి దేవస్థానం నుంచి హనుమాన్ శోభాయాత్ర వివిధ హిందూ సంఘాల ఆధ్వర్యంలో శోభాయమానంగా నిర్వహించారు.

విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్ : ఆత్మకూరు పట్టణంలో బజరంగ్దళ్ వారి ఆధ్వర్యంలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించడం జరిగింది. హిందూ భక్తులందరూ కలిసి శ్రీరాముడు మరియు హనుమంతుడు కలిసి ఉన్న చిత్రపటాన్ని పట్టణంలోని అమ్మవారి శాల నుండి ఆంజనేయ స్వామి గుడి మీదుగా గాంధీ పార్క్, దర్గా మసీదు నుండి పాత బస్టాండ్ లో గల ఆంజనేయ స్వామి విగ్రహం వరకు జైశ్రీరామ్ అనే శ్రీ రామనామ జపంతో హిందూ భక్తులందరూ ఆ ఆంజనేయస్వామిని భక్తిశ్రద్ధలతో పూజించుకొని శోభాయాత్ర నిర్వహించడం జరిగింది.

అలరించిన కోలాటాల నృత్యం

విశాలాంధ్ర - వెలుగోడు : పట్టణంలో గురువారము హనుమాన్ జయంతి సందర్భంగా అన్ని దేవాలయాల నందు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఉదయం బిజెపి, బజరంగ్దళ్ కార్యకర్తలు బైక్ ర్యాలీ ప్రధాన వీధుల గుండా నిర్వహించారు. హనుమాన్ విగ్రహంతో ప్రధాన వీధులలో గ్రామోత్సవం నిర్వహించారు. అశ్వత్ ఆంజనేయ స్వామి దేవాలయం ముందు సరస్వతి విద్యా మందిర్‌కి చెందిన బాలికలు కోలాట నృత్యం చేసి ప్రజలు అలరించారు.

చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు

విశాలాంధ్ర - నంద్యాల రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన నవోదయం చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ ప్రొహిబిషన్ ఆఫీసర్ రవికుమార్, సీఐ కృష్ణమూర్తిలు హెచ్చరించారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ జిల్లా పరిధిలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన చట్టాన్ని ఉల్లంఘించిన, గ్రామాల్లో నాటు సారా, బెల్లం, బెల్టు షాపులు నిర్వహించిన కేసులు నమోదు చేసి జైలు కు పంపడం జరుగుతుందన్నారు. ప్రధానంగా ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని 19 తేదీ ఫిబ్రవరి 2025 సంవత్సరము నవోదయ 20 చట్టాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అందువల్ల ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని జిల్లా వ్యాప్తంగా నాటు సారాయిక్రయించే వారిని, నాటు సారాకు ఉపయోగించే బెల్లం బెల్టు షాపులపై నిగా ఉంచి కేసులునమోదు చేయడం జరుగుతుందన్నారు. సారా తయారు చేసే వారిని అలాగే బెల్టు షాపులు నిర్వహించే వారిని గమనించి మండల తాసిల్దారుల దగ్గర బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. ఇలాంటి వ్యాపారాలు చేసేవారు తక్షణమే మానుకోవాలని వారు తెలిపారు.